సంతృప్త స్థాయిలో సంక్షేమ ఫలాలు

• నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: ప్రజలకు సంతృప్త స్థాయిలో సంక్షేమ పథకాలు అందించడమే గడప గడపకు మన ప్రభుత్వం లక్ష్యమని నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. రూరల్ పరిధిలోని 29వ డివిజన్‌లోని గాంధీనగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికంగా నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలను సజావుగా అందిస్తున్నారని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, కార్పొరేటర్లు సత్తార్, విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, అవినాష్, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్రాధ్యక్షుడు మాళెం సుధీర్‌రెడ్డి, మర్రిపాడు జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, రైల్వే బోర్డు సభ్యుడు వెంకయ్య, నాయకులు హరిబా బు యాదవ్, సురేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తున్న ఎంపీ ఆదాల

ప్రజల సహకారంతో ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తి

• నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): కరోనా నేపథ్యంలో హరినాథపురం ఫ్లైఓవర్ నిర్మాణ పనుల్లో కొంత జాప్యం జరిగి ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడినప్పటికీ ప్రజల సహకారంతో పనులను పూర్తి చేశామని, ఫ్లైఓవర్‌పై శనివారం నుంచి వాహనాలను ట్రయల్ రన్‌లా వదలనున్నట్లు నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్ తెలిపారు. 15వ డివిజన్, బాలాజీనగర్‌లోని ఆంధ్రా బ్యాంకు వీధి, గంగిశెట్టివారివీధి, పోలేరమ్మ వీధి, తదితర ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దివంగత సీఎం వైఎస్సార్ జయంతి సందర్భంగా ఫ్లైఓవర్‌పై ట్రయల్ రన్‌లా వాహనాలను వదులుతున్నామన్నారు. మరో 20 రోజుల్లో ఫ్లైఓవర్ కింద రోడ్లు, గ్రీనరీ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఆ తర్వాత లాంఛనంగా ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తామన్నారు. ఫ్లైఓవర్ నిర్మాణాన్ని తమ ప్రభుత్వ హయాంలోనే మొదలు పెట్టి పూర్తి చేశామని, ఇది తమ పార్టీకి అభివృద్ధి పనులపై ఉన్న చిత్తశుద్ధి అన్నారు. ఫ్లైఓవర్ నిర్మాణ పనులకు సహకరించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. కార్పొరేటర్ గణేశం సుజాత, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్



స్థానికుల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అనిల్

రూ.1.10 కోట్లతో రోడ్ల నిర్మాణం

నగరంలోని 8వ డివిజన్, నవాబుపేటలో రూ.1.10 కోట్లతో సీసీరోడ్డు, బీటీ రోడ్డు నిర్మాణ పనులకు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవాబుపేట పోలీస్ క్వార్టర్స్ నుంచి నవాబుపేటరోడ్డు జంక్షన్ వరకు రూ.70 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. నాయీబ్రాహ్మణ వీధి నుంచి హైవేకు రూ.40 లక్షలతో బీటీ లింకు రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని వివరించారు. మరో రెండ్రోజుల్లో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు అవసరమైన 11 రకాల ప్రభుత్వ సేవలను ఉచితంగా అందజేస్తున్నారని తెలిపారు. ప్రజల వద్దకు పరిపాలనను తీసుకెళ్తున్న జగనన్నకు ప్రతిఒక్కరూ అండగా ఉండాలన్నారు. 2019 ఎన్నికల తర్వాత నాలుగేళ్లుగా కనిపించని వారు మళ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్నారన్నారు. ప్రజలు ఆలోచించాలని కోరారు. డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ మొగళ్లపల్లి కామాక్షిదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



10న జాబ్‌మేళా

నెల్లూరు(మినీబైపాస్): జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఈ నెల 10వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కేవీ రామాంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాయోలుక్కాస్ ఇండియా లిమిటెడ్, రేస్ డైరెక్ట్ సర్వీసెస్ కంపెనీల్లో సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, సేల్స్ ట్రెయినీ, టెలీ ఎగ్జిక్యూటివ్స్, రిసెప్షనిస్ట్, కలెక్షన్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన వారు నెల్లూరు, ఆటోనగర్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.

క్లుప్తంగా

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం

నెల్లూరు (టౌన్): నగరంలో ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో శోభాయాత్ర నిర్వహించారు. ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగాధర్, నగర కార్యదర్శి యశ్వంత్ పాల్గొన్నారు.

నెల్లూరు ఆర్టీఓగా చందన బాధ్యతల స్వీకరణ



నెల్లూరు (టౌన్): నెల్లూరు ప్రాంతీయ రవాణాశాఖ అధికారిగా చందన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఆమె ఉపరవాణా కమిషనర్ బీ చందర్‌ను కలిసి జాయినింగ్ రిపోర్టును అందజేశారు. ఆమె గతేడాది సెప్టెంబరు 23న నెల్లూరు ఆర్టీఓగా నియమితులయ్యారు. అనంతరం శిక్షణ నిమిత్తం వెళ్లారు. శిక్షణ పూర్తి చేసుకుని వచ్చిన ఆమెకు ఇన్‌చార్జి ఆర్టీఓ మురళీమోహన్ బాధ్యతలు అప్పగించారు. అనంతరం అడ్వాన్స్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ పనులను డీటీసీ చందర్, ఆర్టీఓ చందన పరిశీలించారు. ఎంవీఐలు బాలమురళీకృష్ణ, మురళీమోహన్, ఏఓలు కిషోర్, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

23న ప్రజా సింహగర్జన సభ

నెల్లూరు(వేదాయపాళెం): రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా నూతన రాజకీయ పార్టీని స్థాపిస్తున్నట్లు ప్రముఖ పారిశ్రామికవేత్త, బీసీ యువనేత బోడే రామచంద్రయాదవ్ తెలిపారు. ఈ నెల 23న గుంటూరు, విజయవాడ మధ్యన నిర్వహించనున్న ప్రజా సింహగర్జన సభలో నూతన రాజకీయ పార్టీ విధి విధానాలను ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ప్రజా సింహగర్జన సభ పోస్టర్లను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. బీసీ నేతలు బొమ్మి నాగకిశోర్ యాదవ్, ఎస్ఎస్‌యాదవ్, ఉల్లిపాయల శంకరయ్య, లీలాకృష్ణ పాల్గొన్నారు.

బాలకార్మికులకు విముక్తి

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలో బాలకార్మికుల నిర్మూలనకు జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ తనిఖీలు చేపట్టి నమోదు చేసిన 9 కేసులను శుక్రవారం పరిష్కరించినట్లు సహాయ కార్మిక కమిషనర్ గౌస్‌బాషా తెలిపారు. బాల కార్మికులకు వారి యాజమానుల నుంచి రావాల్సిన రూ.92,164 నగదు అందజేసినట్లు చెప్పారు. బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు రూరల్ : ఇటీవల వైఎస్సార్‌సీపీలో చేరిన ఆనం జయకుమార్‌రెడ్డి నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీకు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఇరువురు రాజకీయాలపై కాసేపు చర్చించారు.

శాకంబరిగా రాజరాజేశ్వరిదేవి





ఆషాఢ మాసం శుక్రవారం సందర్భంగా నగరంలోని రాజరాజేశ్వరిదేవి అమ్మవారు శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. 25 రకాల కూరగాయిలు, పండ్లతో అమ్మవారిని ప్రత్యంగిరదేవిగా అలంకరించారు.

-నెల్లూరు(బృందావనం)

రుణాల మంజూరును వేగవంతం చేయండి

నెల్లూరు(బారకాసు): గృహ లబ్ధిదారులకు రుణాల మంజూరును వేగవంతం చేయాలని కమిషనర్ వికాస్ మర్మత్ అధికారులను ఆదేశించారు.కార్పొరేషన్ పరిధిలోని జగనన్న హౌసింగ్ కాలనీలోని గృహ లబ్ధిదారులకు మెప్మా ఆధ్వర్యంలో రుణమేళాను శుక్రవారం నిర్వహించారు. గాంధీనగర్‌లోని మహిళాస్వశక్తి భవన్ ప్రాంగణంలో నిర్వహించిన రుణమేళాకు కమిషనర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గృహ లబ్ధిదారులైన మహిళల సందేహాలను నివృత్తి చేశారు. కమిషనర్ ప్రోత్సాహంతో 25 మంది మహిళలు మెప్మా సంఘాలు/సమాఖ్యల నుంచి రూ.20వేలు చొప్పున రుణాలు పొంది కాంట్రాక్టర్‌కు రూ.5లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగదు చెల్లించిన లబ్ధిదారులకు సంబంధించిన గృహాలను పదిరోజుల్లో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఎంహెచ్ఓ వెంకటరమణ, టౌన్‌ప్లానింగ్ విభాగాధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న కమిషనర్ వికాస్‌మర్మత్

ఆర్యవైశ్య ఆపన్న హస్తం



నెల్లూరు(బృందావనం): సంతపేటకు చెందిన గాదంశెట్టి సుధాకర్‌కు జిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నుడా చైర్మన్, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ శుక్రవారం రూ.4లక్షలు సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుధాకర్ కుటుంబ పరిస్థితిని తెలుసుకుని దాతల సహకారంతో ''ఆర్యవైశ్య ఆపన్నహస్తం'' పేరిట చేయూత అందించినట్లు వివరించారు. ఆర్యవైశ్య మహిళా విభాగం జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు గుండ్లపల్లి పద్మప్రియ, వాయుగుండ్ల సుప్రియ, సింహపురి వాణిజ్యమండలి అధ్యక్షుడు శ్రీరాంసురేష్,ఆర్యవైశ్య ప్రముఖులు నున్నా రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతితో ఉన్నత స్థితికి

నెల్లూరు(పొగతోట): ఉన్నతి కార్యక్రమం ద్వారా ఎస్సీ, ఎస్టీ మహిళలను ఆర్థికంగా ఉన్నతస్థితికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని డీఆర్డీఏ పీడీ కేవీ సాంబశివారెడ్డి తెలిపారు. శుక్రవారం డీఆర్డీఏ సమావేశ మందిరంలో వైకేపీ ఏసీలు, ఏపీఎంలు, సీసీలకు ఉన్నతిపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పీడీ మాట్లాడారు. గ్రామీణ ప్రాంత మహిళలకు ఉన్నతిపై పూర్తి స్థాయి లో అవగాహన కల్పించాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు జీవనోపాదుల కల్పన కు చర్యలు చేపట్టాలన్నారు. ఏపీడీ రాజు, తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి ఎంపోరియం ఏర్పాటుకు సహకారం అందించండి



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌ను ఇస్కాన్‌సిటీలో ఆయన నివాసంలో రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ (లేపాక్షి) చైపర్సన్ బడిగింజల విజయలక్ష్మి, జాతీయ బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగింజల చంద్రమౌళి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. . నగరంలో లేపాక్షి నూతన ఎంపోరియం, వైఎస్సార్ హ్యాండీ క్రాఫ్ట్స్ బజారు ఏర్పాటుకు సహకారం అందించాలని కోరారు. వారి వెంట వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు నందం అశ్వత్థామ, ఏపీహెచ్‌డీసీ అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ పీవీ రామకృష్ణ, మునిరెడ్డి, చేనేత కళాకారులు ఉన్నారు.

మహాలక్ష్మమ్మకు విశేష పూజలు

నెల్లూరు రూరల్: కొత్తకాలువ సెంటర్‌లోని శ్రీమహాలక్ష్మి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం విశేషాభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఒట్టూరు సుధాకర్, పారిశ్రామికవేత్త రామచంద్రరావు, ఆలయ నిర్వాహకులు వేణు, వెంకుబాబు, రమేష్, విజయకుమార్, రమణయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ఇన్‌చార్జిగా రోజారెడ్డి



మంత్రి కాకాణిని కలిసిన రోజారెడ్డి

నెల్లూరు (లీగల్): వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నెల్లూరు, కడప, తిరుపతి జోనల్ ఇన్‌చార్జిగా రామిరెడ్డి రోజారెడ్డి నియమితులయ్యారు. ఆయన గతంలో నెల్లూరు బార్ అసోసియేషన్ కార్యదర్శిగా, ప్రధాన కార్యదర్శిగా న్యాయవాదులకు అండగా ఉండి మన్ననలు పొందారు. ఈ సందర్భంగా రోజారెడ్డిని బార్ అసోసియేషన్‌లో పలువురు న్యాయవాదులు శుక్రవారం కలిసి అభినందనలు తెలిపారు.

నెల్లూరు(దర్గామిట్ట): మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జి రామిరెడ్డి రోజారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఎమ్మెల్యే కోటంరెడ్డి ప్రజావిశ్వాసం కోల్పోయారు



నెల్లూరు రూరల్ : రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారని వైఎస్సార్‌సీపీ ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు పాలకీర్తి రవి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నగరంలోని నెల్లూరు ఎంపీ ఆదాల నివాసంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రూరల్ నియోజకవర్గంలోని రోడ్ల అభివృద్ధికి ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి తనదైన శైలిలో వ్యవహరించి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించారన్నారు. కానీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తాను చేసిన పోరాటాల కారణంగానే నిధులు మంజూరయ్యాయని చెప్పుకోవడం సిగ్గుచేటైన విషయమన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు స్వర్ణా ప్రసాద్, వేలూరు శంకర్‌రెడ్డి, మల్లికార్జున్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై హత్యాయత్నం

నెల్లూరు(క్రైమ్): అకారణంగా ఓ వ్యక్తిపై కొందరు కత్తులతో దాడికి పాల్పడిన ఘటన భగత్‌సింగ్‌కాలనీలో చోటుచేసుకుంది. వివరాలు..వెంకటేశ్వరపురంలోని లక్ష్మీవీధిలో షేక్ ఖాజా నివాసం ఉంటున్నారు ఆయన ప్రైవేట్ ట్రావెల్స్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆయన అత్త, మామలు భగత్‌సింగ్‌కాలనీలో ఉంటున్నారు. గురువారం రాత్రి 11.30గంటల సమయంలో కూల్‌డ్రింక్ తాగేందుకు ఆయన భగత్‌సింగ్‌కాలనీకి వెళ్లారు. అదే సమయంలో కూల్‌డ్రింక్‌షాపులో ఉన్న ఆ ప్రాంతానికి చెందిన ఆటోడ్రైవర్ చాను మద్యం మత్తులో అకారణంగా ఖాజాతో గొడవపెట్టుకుని చెంపపై కొట్టాడు. దీంతో భయాందోళనకు గురైన ఖాజా తన మామ ఇంటికి వెళ్లి జరిగిన విషయాన్ని తెలియజేశారు. ఇంతలో చాను తన కుమారులు సుల్తాన్, సల్మాతో కలిసి అక్కడికి చేరుకుని మాట్లాడుకుందామని హైవే వద్దకు ఖాజాను రమ్మన్నారు. ఖాజా తన మామతో కలిసి హైవే వద్దకు వెళ్లగా, మాట్లాడుకుందాం రా అంటూ ఖాజాను సుల్తాన్ పక్కకు తీసుకెళ్లి తన వెంట తెచ్చుకున్న కత్తితో దాడి చేశాడు. ఖాజా తప్పించుకునేందుకు ప్రయత్నించగా, సల్మా తన స్నేహితులతో కలిసి పట్టుకుని కత్తితో దాడి చేశాడు. దీంతో ఖాజా పెద్దగా కేకలు వేయగా అటుగా వెళుతున్న వారు రావడంతో నిందితులు పరారయ్యారు. గాయాలపాలైన ఖాజాను మామ చికిత్స నిమిత్తం 108లో జీజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు బాధితుడు శుక్రవారం వేకువన నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డీకేడబ్ల్యూలో సర్టిఫికెట్ల ప్రదానం

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో వివిధ సర్టిఫికెట్ కోర్సులు పూర్తి చేసుకున్న 23 మంది విద్యార్థినులకు శుక్రవారం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కళాశాల వైస్‌ప్రిన్సిపల్ రమణారావు విద్యార్థినులను అభినందించారు.భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అధ్యాపకులు సువర్ణ, కవిత, చంద్రశేఖర్, ప్రసాద్, శ్రీనివాసులు, శ్యామల, అపర్ణాదేవి, తదితరులు పాల్గొన్నారు.

జిమ్మిక్కులు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి నైజం

నెల్లూరు రూరల్ : మసిపూసి మారేడు కాయ చేయడం, ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు జిమ్మిక్కులు చేయడం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నైజమని, అతడిని మించిన నటులు ఎవరూ ఉండరని వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ అధికార ప్రతినిధి జీవి ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి ఎంతగానో పాటుపడుతుండగా, తన పోరాటాలతోనే రూరల్ నియోజకవర్గానికి నిధులు కేటాయించడం జరిగిందని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి అసత్య ప్రచారాలు చేసుకోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు.